పచ్చితవుడు

1

వర్షం నొక్కొక్కప్పుడు మనుష్యుల్ని వొక్కొక్క పల్లెటూరిలో స్తంభాల్లా పాతేసి వూరుకుంటుంది. ఎక్కడకూ కదల్నివ్వదు. వీధరుగుల మీద కూర్చున్నవాళ్లు అల్లా కూర్చునిపోతారు. పెద్దపెద్ద వాన కాళ్లు గాలి ధూకుణ్ణే ఏటవాలై భూమిలోకి తీగమేకులల్లే దించుకు పోతూవుంటే నిర్ఘాంతంగా చూస్తూ, ‘ భగవంతునిమాయ ! అంతా భగవంతునిమాయ ! ఎంతట్లో కొట్టి కోలాహలం గావించేస్తూ వుంది ’ అని ఒండొరులతో వుగ్గడించుకుంటూ, మీదిమీదికి జల్లు కొడుతూవున్నకొద్దీ విడిప్రజ మటీదగ్గరసా, మటీదగ్గరసా ఏదో గోడపంచకు జేరుకుంటూవుంటారు.

గోడవతల ఇల్లే వుందో పెరడే వుందో, అంటే వుందో సొంటేవుందో, మాలలే నివసిస్తున్నారో మాదిగలే నివసిస్తున్నారో ఎవరి క్కావాలి ? గోడమాత్రం తమమీద పడిపోకుండా వుంటేచాలు.

ఆలా ఆపద్బాంధవంగా కుదిరి, కూలబడకుండా వున్న పురాతనకుడ్యం వొకటి ‘ పెదసనగొట్టుపాలెం ’ అనే వూళ్లో ప్రసిద్ధికెక్కింది కద్దు దానినిడివి ఎనిమిది గజాలు. ఎత్తు రెండు గజాలు. మంద రెండు అడుగులు. లోపల ఇటికతోకూడిన మన్నో, కేవలం బంకమన్నో ఇప్పటికిన్నీ తెలిసికొన్నవారు లేరు. పైనిమాత్రం వోచోట వెల్ల బెల్లుబెల్లులుగా గిల్లివేయబడ్డ వెలుతులమీద పిడకలు తరవబడి వొలవబడ్డ చిన్నె లున్నాయి.

మఱోచోట వెల్ల మాసిపోయి మిగిలిన జాడులంట ఏవేవో అక్షరాలు ‘ శ్రీరామ ! సీతారామ ! ’ అని మసిబొగ్గుతో వ్రాసినవి కనిపిస్తున్నాయి. ఓమూల చవుడుదేర పేడమెత్తి అలికిన తీరు : ఇంకోమూల చాకలిపద్దు ‘ మామిడంచుల తలపాగాగుడ్డ ’ సౌరు : ఓ ప్రాంతంలో ఎఱ్ఱపెన్సలుతో ఆకుపచ్చ పెన్సలుతో గీయబడి తోకాగికావున్న ఆంజనేయవిగ్రహం : వేఱుప్రాంతంలో తామరతూడు ముట్టెనెట్టుకొన్న హంసబొమ్మ : ఓపక్క ప్లస్సు సంజ్ఞ, ఓ పక్క మైనస్ సంజ్ఞ ; ఓ వెంపు డామ్, ఓ వెంపు ప్రశ్నార్థకము—ఇలా రకరకాల గీతలతో, ఘాతలతో, అక్కరాల్తో, అంకెలతో నిల్చిపోయిందై, ఒకప్పు దేదోకుటుంబానికి, మఱొకప్పుడేదో బాటసార్లకు, ఇంకోఅప్పుడేదో ముష్టివాళ్లకు, వేఱప్పు దేదో సన్యాసులకు, ఎవరూలేనప్పుడల్లరి పిల్లకాయలకు, వానప్పుడు గొడ్లకు, వెన్నెలప్పుడు గోవాళ్ళకు ఆ గోడ ఆసరా యిచ్చి యుండాలి అని చూపఱకు తట్టకమానదు.

ఎండవేళన్నా ధైర్యంచేసి ఆ గోడవెనక యేముందో జిజ్ఞాసగానైనా భావించినవారు లేరు. ఇక దబాటుగా వానపడుతూవుంటే చెప్పనవసరమేలేదు. దాన్ని తాకినవారే అరుదు. ఎప్పుడు ఎవడు పోసిన మదురో అది : మళ్లీ ఆ గోడమీద మదురోసిన వ్యక్తి కానరాడు.

ఒక తెల్లాఱగట్ల ఓ జుత్తున్న పెద్ద కోడిపుంజు ఎక్కడి నుంచి ఎగిరి ఆ గోడమీద నిలబడ్డాదో రెండుకాళ్ళా నిలబడి నిక్కి ‘ కొక్కొరోకో, కొక్కొరొకో ! ’ అంటూ కూయసాగింది. ఊరంతా కొత్తగా వింటూ తెల్లాఱే అంతలో విరగబడి ఆ కోడి పుంజును అతివింతగా—మహావింతగా చూడసాగారు.

ఆలా ప్రజలు విఱగబడి వీక్షిస్తూనేవున్నారు. వెట్టియాన్ వీరేశుగాడు తన పెద్దకర్ర కోడికి తగలకుండా కోడిని దిగమన్నట్టు గిరాటేశాడు. కోడి రెక్కలార్చుకుంటూ రివ్వున గోడ ఆవలెంపుకు వాలింది. వీరేశుగాడు 'అచ్చమ్మగారూ! కోడి మళ్ళా మీ దొడ్లోకే దిగింది. పట్టుకోండి' అని కేకేశాడు. అవలనుంచి కోళ్ళ అచ్చమ్మ 'నాయనా! దొరికింది. పట్టుకున్నాను' అంటూ పుంజును చంకపెట్టుకున్నదై తిప్పుకుంటూ కోడిపాళంగా గోడెక్కి వీధిలోకి దూకడానికి మాత్రం జంకింది.

చూచేజనం కొంతమంది దాంతో గోడలోతట్టు మెఱక అని తాము కొత్తగా గ్రహింప గలిగిన జ్ఞానంతో సంతృప్తులై వెళ్ళిపోయినారు. కొంతమంది తాము విన్న పుంజు కొత్తపుంజు కాదు. అచ్చమ్మ కోడే అని అదాకా పడ్డ రిచ్చపాటు ఎక్కడిదక్కడ విడిచిపుచ్చి వెళ్ళిపోయినారు.

అచ్చమ్మ మాత్రం ఆ కోణ్ణి వీరేశుగాడి కందిస్తూ 'లచ్మీ! నన్ను వొగ్గేసి వెళ్ళిపోతున్నావు!' అంది. వీరేశుగాడు ఆ కోణ్ణి అంది పుచ్చుకుంటూ 'అచ్చమ్మగారూ! జాడీవిండా పచ్చితవుడు పోసి పంపించమన్నారు. పంపించారా?' అన్నాడు. 'ఆఁ! కరణంగా రింటికేనా?' అంటూ అచ్చమ్మ తిరోహిత స్వరూపిణీ ప్రమాణంగా గోడ ఆవలివెంపునకు దిగి చక్కాపోయింది.

గోడమీద మర్నాడు కొత్తకొత్తగా రికార్డయింది—

"అచ్చమ్మ కోడి పచ్చితవుడు ఝాడీ." అని పెద్ద అక్షరాల్తో, రైలుబద్దీల మధ్య వొరవడిలా!

మానవు లీ రోజుల్లో అటువంటి రికార్డు చదివి ఆనందం పొందగలరా ? పొందలేరు. వారికి గ్రామోఫోనురికార్డులు రేడియోరికార్డులు కావాలి ! గోడమీదవ్రాసిన లేఖరిది వట్టి ప్రయాస. ఎవడు చూణ్ను ? ఎవడు చదవను ? ఎవడు వినను ?

2

కెన్‌సింగుటన్‌దొరది అసలుపుట్టుక ఇంగ్లాండుదేశంలో సౌథాంప్టన్ షైరులో మిక్కిలీ మాఋమూల. అయినప్పటికిన్నీ ఐ. సి. ఎస్. పరీక్షలో వుత్తీర్ణుడై హిందూదేశం వచ్చి యిక్కడ మొత్తంమీద—మదరాసు రాజధానియొక్క ఇరవైఅయిదు జిల్లాల్లోను ఇరవైజిల్లాల్లో, జిల్లా వొకటింటికి ఏడాదిఏణ్ణర్థంగా కలకటేరుపనిచేసి రిటైరై, తిరిగి స్వదేశానికి 1937వ సంవత్సరం జూలైనెలలో వోడెక్కి వెళ్ళిపోయినాడు. ఆయన భార్య మిసెస్ కెన్‌సింగ్టన్నుకు హిందూదేశం అంటే వెఱ్ఱిప్రేమ. అసలు ఆమెకు ప్రతీపురుడూ భారతవర్షంలో పోసుకోవాలనే అభిలాష. అయితేం, మగనియొక్క పట్టుదలకొద్దీ ఆమె తన పిల్లల్నందరినీ ఇంగ్లాండులోనే కనేసింది. కన్‌ఫైన్‌మెంటుకని ఆమెను ఆరునెల్ల ప్రెగ్నెన్సీ అప్పటినుంచీ ప్రయాణంగావిస్తూ, ఆఖరుకు ఎనిమిదోనెలనైనా బొంబయిలో వోడెక్కించి పంపించేశేవాడు. కాని 1937 లో దొరగారు ఫించన్‌పుచ్చుకు ఇంగ్లండు వెళ్ళిపోవడం వచ్చినప్పుడు అమ్మగారు గర్భం దాల్చివుండలేదు. రికామీగానే వున్నారు. దాంతో ఆమె మగనికి విస్పష్టంగా విన్నవించింది : ' మీరు ముందు వెళ్లండి. నేను వెనుకనుంచి నెమ్మదిగా వస్తాను. నాకు హిందూదేశం అంటే మిక్కిలీ యిష్టం. ' ఐష్టే హియర్ ఫర్ సమ్‌టైమ్. యు ప్లీజ్ గో ఎ హెడ్. '

దొరగారు ముందు వెళ్ళిపోయినారు. మిసెస్ కెన్‌సింగ్టన్ అన్న ఆవిడ హిందూదేశంలో దిగడిపోయింది.

ఆమె కిప్పుడు పెనిమిట్నిగురించిన హైరాను మరేమీ లేదు. వొక్క క్రిస్టమస్ పండక్కి—అప్పుపత్రాన్ని జ్ఞప్తికి తెచ్చేటట్టు, తన ప్రేమను నెమరుకు దెచ్చే బహుమానం వొకటి ఆయనకు పంపించడంతక్క. మదరాసు యూరోపియన్ క్లబ్బులో బసపెట్టి 1937 నవంబరు 15 వ తేదీనుంచీ యోజించ సాగింది 'ఏం పంపిస్తే బాగుంటుందీ ?' అని. ఆమె కోపూట బహుసున్నితంగా తట్టింది. మిస్టర్ కెన్‌సింగ్టన్ ఉభయగోదావరీ మండలంలో కమానుమీదున్నప్పుడు 'పెదసనగొట్టుపాలెం' అనే కుగ్రామంలో మకాంచేసి అక్కడ కొంతకాలం వున్నట్టు, ఆ కాలంలో అక్కడి కుక్కుటాల నతగాడు గొప్ప డెలికెసీలగా భావించినట్టు తట్టింది. తనభర్త టూర్నుంచి తిరిగివచ్చిన తరువాత కూడా అనేక పర్యాయములు ఆ పెదసనగొట్టుపాలెం కరణానికి తన ఎడ్రెసు పంపుతూ అధమపక్షము వారాని కోతూరైనా వొక కోణ్ణి తెప్పించుకుంటూ వుండేవాడన్న సంగతి ఆ మగనాలియొక్క సంస్ఫురణ వాతావరణాన్ని అలుముకుపోయింది.

వెంటనే ఆ కరణాని కోజాబు వ్రాసింది. తన భర్త తెప్పించుకుంటూ వచ్చిన కోడియొక్క వివరం ఎఱుకపరుస్తూ, ఆ కోడికి వేసే మేతకూడా దాంతో జతపరుస్తూ, చక్కని నెమలి పుంజంత కోడిపుంజును జరుగురుగా పంపించవలసినదని వుత్తరం వ్రాసింది. వ్రాసి ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఎట్టుబిళ్ల అవుత్తరానికి అంటించి తపాలాపెట్టెలో పడేసింది.

పెడసనగొట్టుపాలెంకు తపాలాఫీసు లేదు. కాని ఎక్స్ప్రెస్ డెలివెరీ అంటింపు కాగితాన్నిబట్టి పోస్టల్ డిపార్టుమెంటు వారు ఓ వార్తాహరుని చేతికి తక్షణం ఆ వుత్తరం ఇచ్చి పెడసన గొట్టుపాలెం కరణంగారికి అందచేసినారు. 1937 నవంబరు 25 వ తేదీ సాయంకాలం 7 గంటలకు సరిగ్గా అందింది అది.

వెంటనే కరణంగారు తమవూళ్లో ఇంగ్లీషు వచ్చినవాళ్లు లేక, తనకురాక తికమకపడి, ఆ వుత్తరాన్ని పొరుగూరు మిడిల్ స్కూల్‌మాష్టరు వద్దకు తీసికొనివెళ్ళి వానిచే వినిపించికొని 'మిసెస్ కెన్సింగ్టన్' అని సంస్మరించుకుంటూ రేత్రి 9 గంటలకు చేతిలో వుత్తరం పదిమడత లెట్టుకుంటూ చేరు కున్నాడు. వెంటనే కోళ్ళ అచ్చమ్మకు కబురంపాడు. 'నీ వూసు ఇన్నాళ్లకు మళ్లీ దొరగారి తలంపుకు వచ్చిందేవ్.' అన్నాడు. 'ఏ దొరగారండో?' అంది అచ్చమ్మ. 'పేరు నోట్లో ఆడుతూవుందే. పైకి రావడం లేదే. మఱచిపోయేనే. ఉండు.' అని ఉత్తరం మడతలు వూరికే విప్పి విప్పి తన యింట్లోవున్న 'తుపానులాంతరు' దీపంముందు చూచేడు. కరణంగారికి జ్ఞాపకం రాలేదు పేరు. అచ్చమ్మ 'వుండండి! నే నా దొరగారి పేరు గోడమీద మా వెంపుని ఆయన బట్లరుగారిచేత రాయించు కున్నట్టున్నాను. వెనకోపాలి మనూళ్లో మకాంచేసిన దొరగారే కదండీ!' అంది. ఆపాళంగా అచ్చమ్మా, కరణంగారూ ఇద్దరూ ఆ లాంతరుచ్చుకు, సనాతన పురాతన పాత గోడయొక్క- రెండోవెంపున వ్రాసివున్న దొరగారిపేరు-తెనుగక్షరాల నున్నది- గుర్తించారు-'కిన్సింగ్టన్ దొరగారు' అని గుర్తించి యివలకు వచ్చి 'దొరసానమ్మగారు మాంచి చక్కటి కోణ్ణి పంపమన్నారు'

అన్నాడు అని తన రొంటినుంచి 'తీసి రెండురూపాయలు అచ్చమ్మచేతిలో పెట్టాడు కరణంగారు.

క్కోళ్ల అచ్చమ్మ ఉబ్బి తబ్బిబ్బై పోయింది. వెంటనే కొంచె మిదయి 'కోడి కేంకూడెడతారో ఆరు' అంది. కరణం గారు 'నీ వేం వేస్తావు ?' అని అడిగేడు. 'నేనా ? పచ్చితవుడు. నే దంపుకెళ్ళినచోటల్లా ఓ మానె డట్టుకొచ్చి వేస్తూవుంటాను' అంది అచ్చమ్మ. 'అదే కోడితో జతపరచి పంపించమన్నారు ఆవిడాను. చూడు ! నేనో జాడీ పంపిస్తాను. అందులో పోసి ఇవ్వు. తెల్లాఅగట్ల ఎవరికీ తెలీకుండా లకోటాచేసి పంపించాలి. కోణ్ణి జాగ్రత్తపెట్టు. జాడీ నిండబెట్టు. మళ్లీ నిద్దరోయావు సుమా ! మఱచిపోయేవుసుమా !' అన్నాడు కరణంగారు. 'తెల్లారిపోతేనేమండీ ?' అంది అచ్చమ్మ. కరణంగారు 'పిచ్చి దానా ! కరణునైన్న కోళ్ళనంపుతున్నానంటే యీవూళ్లో బ్రాహ్మ ణ్యం నన్ను ఐతకనిస్తారే ?' అన్నాడు. 'తక్కినబామ్మర్లు మీకంటె పెద్దపెద్ద కానిపనులే చేస్తూవున్నారు. మీరు కానడం లేదుకామోసు. అయినా ఆ నీలిటొంపు మనకెందుకునేండి. అలాగేలేండి' అని సెలవుపుచ్చుకుంది అచ్చమ్మ.

కరణంగారింటికొచ్చి, కోణ్ణి ప్యాక్‌చేయడం ఎట్లా, రైలెక్కించడం ఎట్లా, జాడీకి సీలేయడం ఎట్లా అనే ఇట్లాంటి ఆలోచనల్తోనే రేత్రి మూడోజాందాకా — మూడోజాందాకా యేంటి ? గోడెక్కినకోణ్ణి అచ్చమ్మ వీరేశుగాడి కందిచ్చి, ఆమె కూడా జాడీతోనూ, కోడితోనూ వీరేశుగాడి వెనకాలే వచ్చి తన యింట హాజరయ్యేదాకా—కాలం గడిపేడు.

అచ్చమ్మొచ్చాక, కోణ్ణి చూచాక ' అచ్చమ్మా! నీకోడి యొక్క వివరం వ్రాయమన్నారే దొరసానమ్మగారు. ఏమని వ్రాసేది ' అని అడిగేడు కరణం అచ్చమ్మొంక తిరిగి, అడుగుతూ వ్రాసేశాడు ఓ కాగితమ్ముక్కమీద ' అచ్చమ్మ కోడి నెం. 1. ' అని. ' అచ్చమ్మా! నీ పేరు కోడికూడా పెట్టేశాను. ' అంటూ ఆ కాగితాని కోదారం కట్టి ఆ దారం ఆకోడి కాలికట్టాడు కరణం. కోణ్ణి, జాడీని పంపేశాడు.

అచ్చమ్మ అన్నాది : ' మీ రెంత రహస్యంగా రెండో కంటికి తెలియకుండా అంపాలనుకున్నారో అంత వెల్లడి అయిపోయింది కరణంగారూ! నా పేరుకూడా బయటపెట్టేస్తున్నారు : పెట్టెయ్యండి ఏం చేస్తాను ? ముండాకోడి ముట్టుకోనిచ్చింది కాదండీ! రేత్రి పట్టుకు గంపకిందదేసి గుట్టుగా మట్టుగా అట్టే పెట్టేద్దామంటే, సుక్కొడవకుండానే గోడెక్కికూకుంది. వీరేశుగాడు అవతల్నుంచి కర్రిసరకపోతే తుర్రోమని తోటలూ పేటలూ దూక్కుంటా పోయేదే ' అని

3

బ్రాడ్‌కాస్టింగు గ్రీడ్‌కాస్టింగు యంత్రాలూ తంత్రాలూ వచ్చింతరువాత, స్ఫియర్ గియర్‌లాంటి పుస్తకాల్లో దూర దూరపు బొమ్మలు కమ్మలు గుచ్చెత్తిపోసినట్టు కనిపిస్తూవున్న తరువాత కథలో లండన్‌నగరాన్ని గురించి వ్రాయడం కేవలం పాఠకులయొక్క విలవైన కాలాన్ని వృథా పుచ్చడం.—

" క్రోయిడన్ " మైదానమ్మీద కొక్కొరోకో అని అచ్చమ్మకోడి గంపలోంచి కూసేసరికి సీమదొరలూ, సీమదొర

సానులూ వాళ్ళనాంపులూ నవుకరులూ వేలకువేలుగా చుట్టేశారు. దాంతో కూడా పచ్చితవుడుజాడీ దిగుమతీ కావడంతోనే ఆ జాడీ మీద పేరు చూచేరు.

" Asham Kodi—అషమ్‌కోడి

Pashi Tavudu Jadi—పషితవుడ్ జాడి "

అవి కూడా బలుక్కుంటూ చాలామంది అక్కడివారు అషామ్ ' ' అంకుల్‌షామ్ ' కు చుట్టమా అని, 'పషి తవుడ్' పార్శీవాళ్ల వుపయోగించుకునే 'ముఖంజల్లుపొడి' వా అని యిలా కించిద్వినూతనవినోదంగా విచారణ గావించారు. అంతకంటె ఎక్కువ కనిపెట్టడానికి ఎవరికిన్నీ వశంకాకపోయింది. ఎంచేతా అంటే ఎవరి పార్శెళ్లు వాళ్ళకు వెంటనే పంపివేయబడాలి. అందులోను కోడి అన్నది ' లివింగుస్టాక్ '—ప్రాణంతో వున్న పదార్థం. ఎయిర్ రూటున పంపబడింది. సద్యోగర్భంలా వెంటనే డెలివరీ అయిపోవాలి.

ట్రఫాల్గర్ స్క్వేరులో ఓ పదంతస్తులమిద్దె మీద తగు మాత్రంగదిలో ' హార్తు ' ముందు వెచ్చగా కూర్చుని కిసిమిసి పండగ నడుపుకుంటూవున్న కిన్‌సింగ్టన్ దొరగారి ముందుంచబడ్డాయి కోళ్లగంపా, పచ్చితవుడు జాడీ. మటిన్నీ మిసెస్సు కింసింగ్టన్ కేబిల్ ముఖతా కొట్టిన కిస్‌మిస్ సుఖాభినందన వాక్యాలుకూడా అప్పుడే దొరగారి కందినయి. చూచాడు. చదువుకొన్నాడు.

" ఓ ప్రేయసీ! నీకు నాయందు గల ప్రేమ అపారం అని ఈ పూట తెలుసుకొనుచున్నాను. నీవు పంపిన కాక్, కాక్

పుడ్ జాగ్రత్తగా చేరినయి. రిటర్న్ న్యూయియర్ గ్రీటింగ్స్!" అని భార్యకు వెంటనే మిస్టర్ కిన్సింగ్‌టన్ కేబిల్ కొట్టి, కోణ్ణి తవుణ్ణి బట్లరుకి వొప్పజెప్పినాడు. మఱిన్ని లండనులో తానున్న మాటమఱచిపోయి, గోదావరి కలెక్టరుగా వుండి పెడసనగొట్టు పాలెంలో టూరింగు ఆఫీసరుగా విశ్రాంతిగొన్న సంగతి అంతా ముంజేతిఅద్దంలా కనిపిస్తూవుంటే మురిసిపోయినాడు. 'అషామ్! హూ ఈజ్ అషామ్. అచ్చమ్. ఇట్ మస్ట్ బి కోళ్ల అచ్చమ్మ. ఐ షల్ సెండ్ హెర్ ఎ సావనిర్ ఆఫ్ సమ్ కైండ్.' అని తన టేబిల్‌మీద వున్న ఫిజికల్ కల్చర్ మాగజీన్—బొమ్మలతో వున్నదొకటి—తీసి ప్యాక్‌చేసి దానిమీద చిరునామా వ్రాసేడు.

Miss Kolla Achamma
Pedasangottupalem,
Godavari Dt M. P

(కోళ్ల అచ్చమ్మకు, పెడసనగొట్టుపాళెం,
గోదావరి జిల్లా, మద్రాసు ప్రెసిడెన్సీ.)

అని వ్రాసి వెంటనే దాన్ని ప్రెజెంటేషన్‌కాపీగా పంపించాడు. పోస్టు చేయడానికిముందు ఆ బుక్కు-పాకెట్టుకో వాయువిమానపు టప్పాల నీలపుబిళ్ళ అంటించి, పోస్టుచేయడానికి తనమిద్దె దిగి కిందికి వచ్చాడు.

లండనులో ఆ క్రిస్టమస్ సాయంకాలం మహాప్రళయంగా వానకురిసి ట్రాఫిక్ ఆగిపోయింది. నెల్సన్‌స్టాచ్యూ నెల్సన్ స్టాచ్యూలా వాననీళ్లల్లో ప్రతిఫలిస్తూవుంది. అదేమిన్నీ గమనించకుండానే మిస్టర్ కిన్సింగ్‌టన్ ఓవర్‌కోటు ఈడ్చుకొంటూ వైళంవెళ్లి పోస్టుబాక్సులో ఆ మేగజీన్ పడేశాడు.

అచ్చమ్మ మిక్కిలీ రిచ్చపాటుతో ఆ బొమ్మల పుస్తక బహుమానం 1938 సంక్రాంతి పెద్దపండగనాడు అందుకుంది. తాను దంపుతూవుంటే వేసికొనే చీరా రయికాకాని వేషంలాంటి వేషం వేసికొనివున్న ఓ దిసపిక్కల, దిసఱెక్కల బొమ్మను ఆ పుస్తకపు ముఖపత్రమ్మీద కనిపెట్టిందై అచ్చమ్మ తిన్నగా కరణంగారి దగ్గఱకు వెళ్ళింది. వెళ్ళి బొమ్మను కరణంగారికి చూపిస్తూ ' ఈ బొమ్మ అన్నిందాల నన్ను పోలివున్నట్టుందేం టండి సూడండి కరణంగారూ ! ' అంది. కరణం అచ్చమ్మ మెర యిస్తున్న కర్ణకనక మోకంట, అచ్చమ్మ దరియిస్తున్న బొమ్మో కంట, లక్షిస్తూ అన్నాడు : ' వొక్క నీ ఱెప్పలమీద పచ్చితవుడు తప్పిస్తే నీవు శతధా సర్వధా ఈ బొమ్మను పోలి వుంటావు అనుకో అచ్చమ్మా! నీకీర్తి దిగంతాలా మారుమోగిందే అనుకో!' అన్నాడు. ఎక్కణ్ణుంచి పొత్తం వచ్చిందో ఆవులిస్తే పేగులు లెక్కించే కరణానికి ఎఱుకపడకుండా వుంటుందా ?

అచ్చమ్మ మళ్ళీ మళ్ళీ ఆ బొమ్మకేసి చూస్తూ, ' ఆదొర గారికి నేనంటే ఎంత గాఁపకమో ! ' అని హెచ్చరిల్లి ఒక్క గుక్కలో కళ్ళనీళ్లు గుక్కుకుంది. ' మాయదారి ఆ కోడి యిక్కడవుండి వుంటే ఎన్ని పుంజుల్ని యేల పందాల్లో మనూర ఘొడిచివుండేదో కదా మహరాజా ! పెట్టిముండను కక్కుర్తిపడి, మీ రిచ్చిన ముందా రెండురూపాయల కాసపడి అమ్ముకున్నాను.' అని వెక్కుతో వాక్కుతో వెక్కుతో వాక్కుతో కూలబడి పోయింది.

కరణంగారు ' ఎందుకు అచ్చమ్మా ఏడుస్తావు ? ఇక్క డుంటే నీ కోడి చవిటిగోడెక్కి అఱవడమేకదే. నీకు ఆకళింపు

లేదుగాని, సీమదొర కుబేరకుక్షిలో నిక్షిప్తమై జీర్ణించే మహా భోగం ఏ జీవికి పట్టును ? ఏడవకు. ఇంటికి పో ' అని ఆమెను సాగనంపేడు.

ఎంత సాగనంపినా అచ్చమ్మ తన కొంపలోకి పోలేక పోయింది. నిర్జీవప్రతిమల్లే ఇక్ష్వాకుల్నాటి తన పెరటిగోడ యొక్క వెలపలితట్టుకు తన చట్టలు తగిలేటట్టు జేర్లబడి పోయింది. తనయొక్క అమ్ముడుపోయిన కోడికూత, ఆకాశ వాణీ స్మృతిమాత్రంగా వినిపిస్తూవుంటే, అచ్చమ్మ గుండె నెదిరి, గోడచవుడే పచ్చితవుడుగా విరజిమ్మేసింది.